ఈనాడు
నారాయణపేట
గురువారం అక్టోబరు 10, 2024

సరిహద్దులు దాటిన దందా

గుట్కా, మట్కా, జూదంతో చిత్తవుతున్న జీవితాలు



సరిహద్దులో కర్ణాటక చెక్‌పోస్టు ఇలా..

న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

అలవాటు వ్యసనంగా మారితే ఇక అంతే సంగతులు. ఫలితంగా అప్పులు.. అనారోగ్యాలు.. ఆత్మహత్యలు.. హత్యలకు దారితీస్తున్న ఉదాహరణలు ఎన్నో. కుతూహలంతో మొదలెట్టి చెడు అలవాట్లుగా మారి చివరికి వాటికి బానిసలైన వారు కుటుంబాలనే దివాళా తీయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి కర్ణాటక సరిహద్దుగా ఉండటంతో అడ్డదారుల గుండా గుట్కా, గంజాయి, నల్లబెల్లం, పొగాకు ఉత్పత్తులు ప్రవేశిస్తున్నాయి. గద్వాల, నారాయణపేట, వికారాబాద్ జిల్లాలకు ఇవి చేరుతున్నాయి. రెబన్‌పల్లి, కాన్‌కుర్తి, సజనాపూర్, వాసునగర్, నందిన్నె చెక్‌పోస్టులను దాటుకుని వస్తున్నా అడిగేవారే లేరు.

నిషేధం ఉన్నా... : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే నెల నుంచి గుట్కాను నిషేధిత జాబితాలో చేర్చినా ఇప్పటికీ వ్యాపారం గుట్టుగా సాగుతోంది. కర్ణాటకలో గుట్కా, పొగాకు ఉత్పత్తులపై నియంత్రణ లేకపోవడంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రాయచూరు నుంచి వస్తున్న సరకు తెలంగాణ మీదుగా ఏపీకి వెళ్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మక్తల్ పట్టణంలోని సంతబజారులో గుట్కా వ్యాపారి పోలీసులు వచ్చినా ఏం కాదనే ధోరణితో వ్యవహరిస్తున్నారని, అలాంటప్పుడు ఫిర్యాదు చేసి ఉపయోగం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పల్లెలకు పాకిన మట్కా : ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు పెద్ద పట్టణాలకే పరిమిత మైన ఈ క్రీడ పల్లెలకూ పాకడంవిస్తుగొలుపుతోంది. ఏజెంట్లుగా మారిన చాలా మంది యువకులు చరవాణులలో ప్రత్యేక యాప్‌ల ద్వారా ఈ నెంబర్ గేమ్‌ను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించారు. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే రోజూ వందల మంది కొత్తగా ఇందులోకి దిగుతున్నారు.

ఒకప్పుడు ఈ వ్యసన క్రీడను ప్రత్యక్షంగా వెళ్లి ఆడేవారు. అంతా చరవాణిలోనే సాగిస్తున్నారు. మక్తల్ మెయిన్ రోడ్డులో ఓ వ్యక్తి నెలకు రూ.10వేల కిరాయి చెల్లిస్తూ తన దుకాణాన్ని అడ్డాగా మార్చుకొని మట్కాను ప్రోత్సహిస్తున్నారు. నారాయణపేట శివారు కాలనీలో ఒకరు మూడు ఇళ్లు అద్దెకు తీసుకొని పేకాట, మట్కా దందా నడిపిస్తున్నారు.

విస్తరిస్తున్న జూద కేంద్రాలు : పేకాట జూదానికి వేలాది కుటుంబాలు బలైపోతున్నాయి. రాయచూరు క్లబ్‌లలో 24గంటలు ఈ క్రీడకు అనుమతి ఉన్నందున ఈ ప్రాంతం నుంచి మరీ రాయచూరు వెళ్లి దివాళాతీసే వారు ఎందరో కనిపిస్తారు. జిల్లా నుంచి కిరాయి వాహనాలు నేరుగా పేకాట క్లబ్‌ల వద్దకే నడిపిస్తున్నారు.

● మక్తల్ మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తన సొంత వాహనంలో మనుషలను తీసుకెళ్లి హైదరాబాద్, షాద్‌నగర్‌లలో ఆడించేవాడు. ఆ తర్వాత రాయచూరుకు మార్చారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పేకాట, మట్కాలకు బానిసై తనకు ఉన్న ఏడెకరాల భూమిని అమ్ముకున్నారు. ఓ వెలుగువెలిగిన వ్యాపారవేత్త పేకాటకు రాయచూరు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారు.

● నారాయణపేటలో పేరున్న వ్యాపారి పేకాటతో దివాళా తీసి చివరకు సొంత ఇంటిని తాకట్టుపెట్టారు.

● ఊట్కూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి తన జోడెద్దులు అమ్మి వచ్చిన రూ.1.2 లక్షలను జూదం ఆడి పోగొట్టుకున్నారు. కుటుంబ సభ్యులు మందలించగా ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఏం చేయాలి? : కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. కూరగాయల మాటున మత్తు పదార్థాలు రాకుండా అడ్డుకోవాలి. ఏళ్లకు ఏళ్లు పాతుకుపోయిన చెక్‌పోస్టు ఉద్యోగులను తరచూ బదిలీ చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యసన విముక్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కౌన్సెలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి.

ఆకాశంలో హరివిల్లు



జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ వర్షం పడింది. ఆకాశంలో ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది. ఊట్కూరులో సాయంత్రం కనిపించిన దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

- న్యూస్‌టుడే, ఊట్కూరు

7 యూనిట్లకే విద్యుదుత్పత్తి పరిమితం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద ఉద్ధృతి తగ్గడంతో ఎగువ, దిగువ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి ఏడు యూనిట్లకే పరిమితమైంది. ప్రాజెక్టుకు 22 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 22,611 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన మూడు యూనిట్ల ద్వారా 4.018, దిగువన నాలుగు యూనిట్ల ద్వారా 4.554 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలంలో ఎగువన 250.024, దిగువన 227.385 మిలియన్ యూనిట్లుగా ఉత్పత్తి నమోదైనట్లు జెన్‌కో ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) సూరిబాబు తెలిపారు.

సొంత రెవెన్యూనే లక్ష్యం!

- రైతులను పట్టిపీడిస్తున్న అధికారులు
- స్థిరాస్తి వ్యాపారుల కబ్జాలు, అక్రమాలకు అండ



మహబూబ్‌నగర్ : ప్రజావాణిలో కలెక్టర్‌కు భూ సమస్య వివరిస్తున్న బాధిత రైతులు

జడ్చర్లలో భూ వ్యవహారం సీసీఎల్‌ఏకు వెళ్లింది. ఓ సర్వే నంబరులోని 16 ఎకరాల 32 గుంటల స్థలంలో 2 ఎకరాల 10 గుంటల భూదాన్ భూమి ఉంది. దీనికి ఓఆర్‌సీ ఇచ్చారని, ఇందులో జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై వివరణ కోరినా సరిగ్గా స్పందించకపోవటంతో సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ గత నెలలో జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని సస్పెండ్ చేశారు.

తాజాగా కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజుపైనా వేటు పడింది. ధరణిలో పాసు పుస్తకాలకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినందుకు విధుల నుంచి తొలగించారు. ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇనామ్, ప్రభుత్వ భూములకు ఎన్‌వోసీ, ఓఆర్‌సీలు ఇచ్చారని, డబ్బులు ఇవ్వకపోతే ఏ పనీ చేయరని ఆరోపణలు ఉన్నాయి. మొత్తానికి ఆర్డీవోను భూసంబంధ వ్యవహారంలోనే సస్పెండ్ చేశారు.

ఈనాడు, మహబూబ్‌నగర్

కొల్లాపూర్ ఆర్డీవో, జడ్చర్ల తహసీలార్ కొద్ది రోజుల వ్యవధిలోనే సస్పెండ్ కావటం ఉమ్మడి జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ ఏడాది గోపాల్‌పేట, గుండుమల్ తహసీల్దార్లు, కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇలాంటి వాళ్లు ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలా మంది ఉన్నారు. పాలమూరు వ్యాప్తంగా అసైన్డు, సీలింగ్, భూదాన్ భూములు ఉన్నాయి. స్థిరాస్తి వ్యాపారులు, కొందరు నేతలు కలిసి రెవెన్యూ చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని ఎన్‌వోసీలు తీసుకుంటున్నారు. వీరికి సాంకేతికంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొందరు రెవెన్యూ అధికారులు అన్నీ తామై వ్యవహరిస్తూ సహకరిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ నేపథ్యంలో జిల్లాల ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది.

జిల్లాల్లో మచ్చుకు కొన్ని..

● మహబూబ్‌నగర్ జిల్లా గతంలో పనిచేసిన ఓ ఆర్డీవో ఏకంగా 50కి పైగా ఓఆర్‌సీలు ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ భూమికి నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్‌సీని ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత జిల్లాకు చెందిన ఇద్దరు ముఖ్య ప్రజాప్రతినిధులు ఆ ఓఆర్‌సీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఆర్డీవో ఓఆర్‌సీ ఇచ్చిన 50కి పైగా భూముల రిజిస్ట్రేషన్లను ఆపివేశారు. అంతర్గత విచారణ సాగుతోంది.

● వనపర్తి జిల్లాలోని ఓ పురపాలికలో దేవాలయానికి చెందిన సుమారు 30 ఎకరాల భూమికి గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు అక్రమంగా ఓఆర్‌సీ ఇచ్చారు. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఆ భూముల విలువ రూ.కోట్లల్లో ఉంది. ఈ వ్యవహారంలో కొందరు రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

● హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూరులోని పలు ప్రభుత్వ భూములకు నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్‌సీలు ఇచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కొన్ని చోట్ల ప్రభుత్వ భూములకు ఇష్టారాజ్యంగా ఓఆర్‌సీ, ఎన్‌వోసీలు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి.

ప్రజావాణిలో అన్నీ భూసమస్యలే : తమ భూ సమస్యలపై స్పందించటం లేదని, డబ్బులు ఇవ్వకపోతే పనులు చేయటం లేదని, నెలలు, ఏళ్ల తరబడిగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చేవాళ్లల్లో 70 శాతం మంది భూ సమస్యల వాళ్లే. మండల, డివిజన్ స్థాయి అధికారులు పట్టించుకోకపోవటం వల్లనే ఇక్కడిదాకా వస్తున్నారని కలెక్టర్లు కూడా అంగీకరిస్తున్నారు. అయినా పరిస్థితిని చక్కదిద్దటంలో విఫలమవుతున్నారు. ధరణిలో మొత్తం 33 మాడ్యుల్స్ ఉన్నాయి. ఎక్కువగా పాసుపుస్తకాల్లో పేర్లలో తప్పులు, సర్వే నంబర్ల గల్లంతు, డిజిటల్ సంతకాలు పెండింగ్, భూ విస్తీర్ణం తక్కువగా నమోదు తదితరాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదికను ఇవ్వాలి. ఇందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

175 మందికి నియామక పత్రాలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకుంటున్న దామరగిద్ద మండలం సజనాపూర్ గ్రామానికి చెందిన చెన్నప్ప

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాకు చెందిన 175 మంది డీఎస్సీ విజేతలకు హైదరాబాద్‌లో బుధవారం నియామక పత్రాలు అందజేశారు. విద్యాశాఖ అధికారులు ఇచ్చిన సమాచారంతో వీరంతా ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. సీఎం చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. జిల్లాలో 279 ఖాళీలు ఉండగా 234 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలు జరిగాయని, రెండు పోస్టులు వచ్చిన అభ్యర్థులకు కోరుకున్న సబ్జెక్టు కేటాయించలేదంటూ మంగళవారం అర్ధరాత్రి వరకు డీఈవో కార్యాలయం ఎదుట అభ్యర్థులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అలాగే 17 మంది అభ్యర్థులు వివిధ సమస్యలపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయా విభాగాలలో అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేయకుండ నిలిపివేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారని డీఈవో అబ్దుల్ ఘనీ అన్నారు.

నారాయణపేట- మక్తల్ రహదారి మరమ్మతులు ప్రారంభం



రహదారి మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఊట్కూరు, న్యూస్‌టుడే : నారాయణపేట- మక్తల్ రహదారి గుంతలమయమై అధ్వానంగా మారింది. ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై 'ఈనాడు-ఈటీవీ'లో వచ్చిన కథనం యంత్రాంగంలో చలనం తెప్పించింది. జిల్లా సమీక్షలో కలెక్టరు సిక్తా పట్నాయక్ సైతం తీవ్రంగా స్పందించారు. పూర్తిస్థాయి నిధులు వచ్చేవరకు తాత్కాలికంగానైనా ఉపశమనం కల్గించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆలోచించి నిధులు మంజూరు చేయించారు. తిప్రాస్‌పల్లి వద్ద బుధవారం కాంగ్రెస్ నాయకుడు డి.విఘ్నేశ్వర్ రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సి.సూర్యప్రకాశ్ రెడ్డి తదితరులు పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను సకాలంలో పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. ఎంపీడీవో ధనుంజయ గౌడ్, డీఈ రాములు, ఏఈ విష్ణుమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా దసరా సందడే!



ప్రతి ఏటా దసరా నేపథ్యంలో జిల్లాలో గిరిజనులు తుల్జాభవానీ వేడుకల్ని నిర్వహిస్తారు. ఇందుకు వలస ప్రాంతాల నుంచి తండాలకు రాక మొదలైంది. పూణె, ముంబాయి, హైదరాబాద్‌ల నుంచి ఉపాధి నిమిత్తం వెళ్లిన వారందరూ వెనుదిరిగి వస్తున్నారు. ముంబాయి, పూణెలకు వెళ్లిన వారు రైళ్ల ద్వారా కర్ణాటకలోని యాద్గిర్ వరకు చేరుకొని అటు నుంచి ప్రైవేటు వాహనాలు లేదా బస్సుల్లో సొంతూళ్లకు వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 24 గిరిజన గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో మద్దూరు మండలంలోనే 12 ఉన్నాయి. నారాయణపేట, ధన్వాడ మండలాల్లో ఆరేసి చొప్పున ఉన్నాయి. పంచాయతీ వాసులే కాకుండా అనుబంధ తండాలకు చెందిన వారూ ఉన్నారు. బుధవారం ముంబాయి, పూణె నుంచి వస్తూ ధన్వాడ మీదుగా ప్రైవేటు వాహనాల్లో గిరిజన తండాలకు వెళ్తుండగా తీసిన చిత్రాలివి

- న్యూస్‌టుడే, ధన్వాడ

తపాలాఖాతాకు ఉపకార వేతనాలు

పాలమూరు, న్యూస్‌టుడే: ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసే విద్యార్థులు తపాలశాఖలో ఖాతా ఉంటే కూడా అనుమతిస్తామని ఎస్సీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024- 25 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం ప్రకటన వచ్చిందని, ప్రీ మెట్రిక్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇండియన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ పేమెంట్ బ్యాంకు గురించి అంతా తెలుసుకోవాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

వైద్య కళాశాలను పరిశీలించిన ఇంజినీర్లు



మెడికల్ కళాశాలను పరిశీలించిన ఇంజనీర్ల బృందం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు బుధవారం ఎంఐడీసీ ఇంజినీర్ల బృందం నారాయణపేట మండలం అప్పక్‌పల్లిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వైద్య కళాశాలను పరిశీలించింది. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డా.రాంకిషన్‌తో కలిసి చీఫ్ ఇంజనీర్ దేవేందర్ కుమార్, ఎస్ఈ సురేందర్ రెడ్డి, ఈఈ జైపాల్‌రెడ్డి కళాశాల భవన సముదాయాన్ని చూశారు. వివిధ విభాగాల ఏర్పాటు, అవసరమైన పరికరాలు, కల్పించాల్సిన వసతులు గురించి చర్చించారు. నర్సింగ్ కళాశాల నిర్మాణం విషయాన్ని చీఫ్ ఇంజనీర్ దేవేందర్ కుమార్ ప్రస్తావించారు. త్వరలోనే చిన్నపిల్లలు, తల్లులకు కళాశాల కింది అంతస్తులో సేవలు అందించే అవకాశం ఉందని చెప్పారు. కళాశాలకు రోడ్డు, ప్రహరీ, మార్చురీ నిర్మాణం గురించి చీఫ్ ఇంజనీర్ దృష్టికి ప్రిన్సిపాల్ తీసుకువచ్చారు. స్పందించిన ఆయన త్వరలోనే ఒక్కొక్కటిగా నిర్మాణాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మల్లికార్జున్, ఎంఐడీసీడీ ఈఈ కృష్ణమూర్తి, ఏఈ సాయి మురారి పాల్గొన్నారు.

పుష్కర పనులు.. పుష్కల వ్యథలు



మక్తల్ నుంచి కృష్ణా తీరానికి వెళ్లే రహదారి

ఆ ప్రధాన రహదారులను బాగుచేసేది 12 ఏళ్లకు ఒక్కసారే... అదీ హడావుడిగా, నాణ్యత లేకుండా పనులు కానిచ్చేస్తారు. తరువాత ప్రజలు మరో విడత మరమ్మతుల కోసం కృష్ణా పుష్కరాల వరకు ఆగాల్సిందే. ఆలోగా నాసిరకం పనులు దుర్భరంగా మారి ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతోమంది చనిపోవడం, క్షతగాత్రులు కావడం సాధారణమైపోయింది.

న్యూస్‌టుడే- నర్వ

కృష్ణా పుష్కరాల సమయంలో హడావుడిగా చేపట్టిన రహదారుల నిర్మాణాలు ప్రస్తుతం అధ్వానంగా మారాయి. అప్పట్లో నాణ్యత ప్రమాణాలు, కనీస నిబంధనలు పాటించకుండా రోజుల వ్యవధిలో పనులను పూర్తిచేశారు. అప్పటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా మున్నాళ్లకే మూడు గోతులు..ఆరు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించారు. పుష్కరాలు పూర్తయి ఎనిమిదేళ్లయినా ఆ రహదారుల మరమ్మతును పట్టించుకునే వారు కరువయ్యారు.

● నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల పరిధిలోని మక్తల్, నర్వ, అమరచింత, ఆత్మకూరు మండలాల పరిధిలోని పంచాయతీరాజ్, పీజేపీ, ఆర్‌అండ్‌బీల ఆధ్వర్యంలో రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు కృష్ణా పుష్కరాల సందర్భంగా 2016లో నిధులు మంజూరు చేశారు. కేవలం రెండు నెలల ముందే నిధులు విడుదల, టెండర్లు పూర్తిచేసిన ప్రభుత్వం హడావుడి పనులకు గుత్తేదారులను ఆహ్వానం పలికింది. ఎన్నో ఏళ్లకు రోడ్లు బాగుపడ్డాయని ఆశపడిన ప్రజలకు ఆవేదన మిగిలింది.

● ఆత్మకూరు పురపాలిక నుంచి మూలమల్ల మీదుగా జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ పుష్కరఘాట్ వరకు రహదారి అభివృద్ధికి అప్పట్లో రూ.8కోట్లు మంజూరు చేశారు. మూలమల్ల ప్రధాన ఎడమకాలువ పక్క నుంచి కొత్తగా తారురోడ్డు నిర్మాణ పనులను పుష్కర సమయంలో చేపట్టారు. 11 కిలోమీటర్ల రోడ్డు ఇప్పటికీ పూర్తికాలేదు.

● అమరచింత మండలం మస్తీపూర్ అడ్డరోడ్డు నుంచి క్రిష్ణంపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ.3.30 కోట్లు మంజూరవ్వగా అప్పట్లో పనులు పూర్తిచేయలేదు. తరువాత రోడ్డు వేసినా కల్వర్టులు, మస్తీపూర్ గ్రామంలో సిమెంటు రహదారి పనులు చేయాల్సి ఉంది.

● నర్వ మండలం నందిమల్ల నుంచి కొండదొడ్డి వరకు 16 కిలోమీటర్ల తారురోడ్డును అభివృద్ధి చేసేందుకు పుష్కర సమయంలో రూ.3.60కోట్లు మంజూరు చేయగా పనులు హడావుడిగా పూర్తిచేశారు. పెద్దకడ్మూర్ నుంచి యాంకి వరకు ఉన్న మట్టిరోడ్డును బీటీగా మార్చేందుకు రూ.1.60 కోట్లు వ్యయం చేశారు. పనులపై పర్యవేక్షణ చేయకపోవడంతో రెండేళ్లకే గోతలమయం అయ్యాయి.

● మక్తల్ పురపాలికలోని దండు నుంచి సత్యావార్, ముష్టిపల్లి, కొండదొడ్డి వరకు రహదారి మరమ్మతులకు రూ.95లక్షలతో నాసిరకం పనులు పూర్తిచేసి మమ అనిపించారు.



యాంకి- పెద్దకడ్మూర్ మధ్యన గుంతలు

● మక్తల్ నుంచి కర్ని, పారేవుల, పస్పుల, మస్లాయిపల్లి, దాదాన్‌పల్లిలో ఏర్పాటుచేసిన పుష్కరఘాట్ల వరకు వెళ్లేందుకు రూ.3 కోట్లకు పైగా నిధులు వ్యయం చేశారు. కమీషన్లకు కక్కుర్తిపడిన కొందరు నాణ్యత పట్టించుకోకపోవడంతో అవన్నీ దుర్భరంగా మారాయి.

● గద్వాల పురపాలిక నుంచి జూరాల ప్రాజెక్టు వరకు 12 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.కోట్లల్లో వ్యయం చేశారు. కొద్ది రోజులకే నాణ్యత తేలిపోయింది. ప్రస్తుతం గద్వాల నుంచి మక్తల్, నారాయణపేట, ఆత్మకూరు, అమరచింత పట్టణాలకు వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాలి. పదేళ్లుగా ప్రతిపాదనలు పంపుతున్నా ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు.

మూడేళ్లలో రహదారులకు మహర్దశ

అప్పట్లో పుష్కరాల సమయంలో కొత్త, పాతరోడ్ల పనులు హడావుడిగా చేశారు. గతం సంగతి పక్కనబెట్టి రానున్న మూడేళ్ల వ్యవధిలో తారురోడ్డు లేని ఊరంటూ ఉండకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. మంత్రి సీతక్కను రూ.50 కోట్లు రహదారుల అభివృద్ధికి ఇవ్వాలని కోరాను. నిధులు మంజూరు కాగానే దశలవారీగా అభివృద్ధి చేస్తాం.

- వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

ఇల వైభోగం.. ఆది దంపతుల కల్యాణం



కల్యాణంలో భాగంగా తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

అలంపూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో జోగులాంబ ఆలయం వరకు ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి దంపతులు మంగళ వ్యాయిదాలతో తీసుకొచ్చారు. ముస్తాబు చేసిన విగ్రహాలను ఆలయం చుట్టూ పల్లకిలో ఊరేగించి కల్యాణ మండపానికి చేర్చారు. వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం మూలా నక్షత్ర శుభ గడియలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవం తిలకించారు. అనంతరం అమ్మ వారిని సింహవాహన సేవలో భాగంగా పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు.

కాళరాత్రిగా జోగులాంబ: జోగులాంబ దేవి భక్తులకు కాళరాత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


అసలే పేదరికం.. ఆపై క్యాన్సర్ భూతం


తల్లిదండ్రులతో అనిల్

మక్తల్ మండలం సంగంబండ గ్రామానికి చెందిన కళప్ప గొర్రెల కాపరిగా, అతని భార్య పద్మమ్మ రోజుకూలీగా కష్టపడుతూ ఇద్దరు పిల్లలనూ చదివిస్తున్నారు. ఉన్నంతలో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబంలోకి క్యాన్సర్ భూతం అడుగుపెట్టింది. ఇంటర్ చదువుతున్న కుమారుడు అనిల్‌ను కబళించింది. ఇన్నిరోజులూ పోగేసిన డబ్బంతా రక్త క్యాన్సర్ చికిత్సకు నీళ్లలా ఖర్చు చేయాల్సి వచ్చింది. గొర్రెలు విక్రయించి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో కిమోథెరపీ చేయించారు. ఇప్పటికే రూ.10లక్షలు ఖర్చయినా జబ్బు పూర్తిగా నయం కాలేదు. మరో రూ.10లక్షలు ఖర్చుచేస్తే తప్ప బాబు కోలుకోలేడని వైద్యులు చెప్పారు. అంత స్థోమత లేక హైదరాబాద్ నుంచి స్వ గ్రామానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలిసిన ఓ ప్రయివేటు పాఠశాల యాజమాన్యం తరఫున తిరుపతిరెడ్డి దంపతులు రూ.1.20లక్షల ఆర్థిక సాయం అందించడంతోపాటు కుమార్తె పదోతరగతి వరకు ఉచిత విద్యను అందించడానికి ముందుకు వచ్చారు. దాతలు సహృదయంతో స్పందిస్తే 18ఏళ్ల యువకుడికి నిండు నూరేళ్ల జీవితం ఇచ్చినట్లు అవుతుంది.

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే

గుండె నిండా బడిగంటలు




సర్కారు కొలువు సాధనకు కలిసి చదివారు.. కల నెరవేర్చుకునేందుకు ఒకరినొకరు ప్రోత్సహించుకున్నారు. ఒక్కో ఇంటిలో ఇద్దరు, ఒక్కో ఊరిలో ముగ్గురు, ఆరుగురు విజేతలుగా అవతరించారు. యువతకు ఆదర్శంగా నిలిచారు. వారి నేపథ్యం, చదువు, పరీక్ష కోసం సిద్ధమైన తీరు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.

- న్యూస్‌టుడే బృందం

బావ, బావమరుదులు ఒకేసారి


మోహన్‌నాయక్


తుల్యానాయక్

ధన్వాడ, న్యూస్‌టుడే : ముడుగుల మల్లయ్యతండాకు చెందిన మోహన్‌నాయక్ ధన్వాడ మండలంలోని మందిపల్లి కొత్త తండాకు చెందిన తుల్యానాయక్ అక్కను వివాహమాడారు. మోహన్ నాయక్, తుల్యానాయక్ ఇద్దరూ డీఎస్సీకి ఎంపికై ఎస్జీటీలుగా నియమితులయ్యారు. ఒకే సారి బావ బామ్మర్దులకు కొలువులు రావడంపై రెండు కుటుంబాలతో పాటు ఆయా తండాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది

రెండు నెలల్లో రెండు..


జి.గోవర్ధన్

ధన్వాడ, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన జి.గోవర్ధన్‌కు వరుసగా రెండు కొలువులు దక్కాయి. రెండు నెలల క్రితం ఈయనకు బీసీ గురుకులంలో ఉపాధ్యాయుడు ఉద్యోగం వచ్చింది. ఇందులో ప్రవేశం పొందిన ఈయనకు ఇపుడు స్కూల్ అసిస్టెంట్(గణితం) ఉద్యోగం వచ్చింది. జిల్లాస్థాయిలో గణితంలో మూడో ర్యాంకు సాధించిన ఈయన గురుకులం ఉద్యోగం వదిలి స్కూల్ అసిస్టెంట్ ఉత్తర్వులు అందుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన ఉద్యోగాలు రాక ముందు ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే వ్యవసాయంలో తండ్రికి సహాయపడుతూ వచ్చాడు. గణితమంటే చాలా ఇష్టమని, అదే సబ్జెక్టు ఉపాధ్యాయుడిగా అవకాశం రావడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

అన్నదమ్ములు సాధించారు


నియామక పత్రాలతో సోదరులు వెంకటేశ్, శ్రీనివాస్

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న అన్నదమ్ముల లక్ష్యం నెరవేరగా.. అందులో ఒకరు మూడు కొలువులు సాధించి ఔరా అనిపించారు. కోస్గి మండలం పీసీ తండాకు చెందిన ఎస్.నార్యానాయక్, కిష్టమ్మ దంపతుల కుమారులు ఎస్.వెంకటేశ్, ఎస్.శ్రీనివాస్‌నాయక్ 2024 డీఎస్సీలో సర్కారీ ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. ఎస్జీటీ జనరల్ కేటగిరీలో తమ్ముడు ఎస్.శ్రీనివాస్ నాయక్ 19వ ర్యాంకు, అన్న ఎస్.వెంకటేశ్‌కు 11వ ర్యాంకు వచ్చింది. ఎస్.శ్రీనివాస్ ప్రస్తుతం విశాఖపట్నంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా ఇటీవల గ్రూప్-4 పోటీపరీక్షల్లో ప్రతిభచాటి ఉద్యోగం సాధించారు. ఎస్జీటీగా కొనసాగుతామని వారు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వీరు ఒకేసారి ఉపాధ్యాయులుగా నియమితులు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి.

ఒకే తండాలో ముగ్గురికి..


మీనాక్షి తరుణ్ జగన్నాథ్

కోయిలకొండ, న్యూస్‌టుడే: కోయిలకొండ మండలంలోని కేశ్వాపూర్ పంచాయతీ పరిధి పెద్దతండాకు చెందిన ముగ్గురు ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికై ఔరా అనిపించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు కష్టపడి చదివి సత్తాచాటారు. జిల్లాలో ఎస్టీ విభాగంలో 12 ఎస్జీటీ పోస్టులు ఉండగా ఒకే పెద్దతండాకు చెందిన మీనాక్షి, తరుణ్, జగన్నాథ్‌లు ఎంపిక కావడం విశేషం. మీనాక్షి, జగన్నాథ్‌లు గురుకుల ఉద్యోగాలకు ప్రయత్నించి విఫలమైనా అధైర్యపడకుండా ఎస్జీటీలో సత్తాచాటారు.

మూడు ఉద్యోగాలతో జయకేతనం


తల్లిదండ్రులతో రాజేశ్వరి ఎడమ నుంచి రెండో వ్యక్తి

ఊట్కూరు, న్యూస్‌టుడే : నారాయణపేట మండలం శాసన్‌పల్లి గ్రామానికి చెందిన జయశ్రీ, కృష్ణయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గ్రామంలో చిన్న టీకొట్టు నడుపుతూ పిల్లల్ని చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె రాజేశ్వరి కష్టపడి చదివి 2017 డీఎస్సీకి హాజరుకాగా 0.6 మార్కుతో ఉద్యోగం కోల్పోయారు. తల్లిదండ్రుల కష్టం మనసులో ఉంచుకుని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోటీపరీక్షలకు సిద్ధమయ్యారు. గురుకుల ఉపాధ్యాయుల ఎంపిక పరీక్షల్లో ప్రతిభ చాటి టీజీటీ ఆంగ్లం, సాంఘికశాస్త్రం ఉద్యోగాలు సాధించారు. మూడు నెలల క్రితం మక్తల్ జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా చేరారు. ప్రస్తుతం ఎస్జీటీగా అవకాశం వచ్చినా తరువాత ర్యాంకు వారికి అవకాశం వస్తుందనే భావనతో వదులుకుంటున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో సివిల్స్ ఉద్యోగం సాధించటమే లక్ష్యమని చెబుతున్నారు.

ఔరా! ఐదు కొలువులు


వెంకట్రామి రెడ్డి, గుండుమాల్

కోస్గి, న్యూస్‌టుడే: ఒకటి కాదు... రెండు కాదు... అయిదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అంటే మాటలా? కానీ చేసి చూపించారు గుండుమాల్‌కు చెందిన బాయికాడి వెంకట్రామిరెడ్డి. తండ్రి నారాయణరెడ్డి, తల్లి యశోద వ్యవసాయం చేసుకుంటూ ఆయనను చదివించారు. 2020లో కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, చేయడం ఇష్టం లేక వెళ్లలేదు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో 2017లో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం భక్తిమళ్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇటీవల డీఎస్సీలో సాంఘికశాస్త్రంలో జిల్లా స్థాయి మొదటి ర్యాంకు, తెలుగులో ఎనిమిదో ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు.. మరో పరీక్షలో రాష్ట్రస్థాయి 164వ ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమాధికారిగా ఎంపికయ్యారు. . తాను ఉపాధ్యాయుడిగానే కొనసాగి పేద విద్యార్థులకు సహాయపడతానని వెంకట్రామిరెడ్డి చెప్పారు.

యాభైలో పడినా...


అశ్విని నర్సింలు

ధన్వాడ : ధన్వాడ పట్టణానికి చెందిన అశ్విని నర్సింలు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయన తెలుగు పండిట్ కోర్సు చదువుకున్నారు. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూనే, ఇంటి వద్ద ట్యూషన్లు చెబుతూ, కులవృత్తి చేస్తూ ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వయసు 50లో పడినా ఇదే చివరి అవకాశం కావడంతో అహర్నిశలు కష్టపడ్డారు.

రోలర్ స్కేటింగ్‌లో జాతీయ స్థాయికి



బంగారు పతకంతో రితిక్ అభిమన్యురెడ్డి (మధ్యలో)

ధరూరు, న్యూస్‌టుడే : మిర్యాపురం గ్రామానికి చెందిన రితిక్ అభిమన్యురెడ్డి రాష్ట్ర స్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కారణంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబరులో మైసూరులో 11 ఏళ్లలోపు విభాగం రోలర్‌స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావటంపై గ్రామస్థులు అభినందించారు.

వరి కంకులను తలపిస్తున్న మంచు బిందువులు



మంచు కురిసె.. కంకుల్లా మెరిసె!


వరి పైరుపై మెరుస్తున్న మంచు బిందువులు

వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. తెల్లవారు జామున మంచు కురుస్తోంది. మంచు కరిగి వరి పైరు కొనలపై నీటి బిందువులు సూర్య కిరణాలకు మెరుస్తూ కంకులను తలపిస్తున్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట ప్రాంతంలో ఈ చిత్రాలు 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కాయి. **- న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం**

సహకారంతో గెలిచారు..


చెన్నప్ప, సజనాపూర్

దామరగిద్ద : సజనాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, హన్మంతు దంపతులకు అయిదు గురు సంతానంలో మూడోవారు చెన్నప్ప. ఈ కుటుంబం వ్యవసాయం, గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తోంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించని స్థితిలో వ్యాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చెన్నప్ప చదువును కొనసాగించారు. ఇటీవల డీఎస్సీలో జిల్లాలో 13వ ర్యాంకుతో ఉపాధ్యాయ నియామక పత్రాన్ని సీఎం చేతులమీదుగా అందుకున్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెన్నప్ప చెప్పారు.

భర్త ప్రోత్సాహంతో మూడు..


మమత

వనపర్తి పట్టణం : కొత్తకోటకి చెందిన మమత మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. భర్త రాఘవరెడ్డి ప్రోత్సాహంతో వీటిని సాధించానని ఆమె తెలిపారు. టీజీటీ గణితం ఉద్యోగానికి ఎంపికై వెల్టూరు బీసీ గురుకుల పాఠశాలలో పని చేస్తున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ గణితంలో జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. బుధవారం హైదరాబాద్‌లో నియాయక పత్రం అందుకున్నారు. హాస్టల్ వార్డెన్‌గా ఎంపికైనప్పటికీ ధ్రువపత్రాల పరిశీలన కాలేదు.

ఊట్కూరు.. ఆరుగురు


కె.అశోక్, మాలతి లత

ఊట్కూరు : ఊట్కూరు నుంచి ఏకంగా ఆరుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. సర్దార్‌నగర్ ప్రాంతానికి చెందిన జి.ప్రదీప్ తెలుగు పండింట్‌గా, శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన కె.అశోక్ స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం)గా నియామకపత్రాలు అందుకున్నారు. మాలతి లత జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా, కార్గిల్ చౌరస్తా ప్రాంతానికి చెందిన యువకుడు మహేశ్, శివాజీనగర్ ప్రాంతానికి చెందిన భారతి ఎస్జీటీలుగా నియామక పత్రాలు అందుకున్నారు. టి.మోనప్ప(పాతపేట) హిందీ పండిట్‌గా ఎంపికయ్యారు. వీరంతా ఊట్కూరు పేరును మార్మోగించారు.

పీజీ వైద్య సీట్లకు కసరత్తు

ఎముకలు, ఈఎన్‌టీ, మత్తుమందు, నేత్ర విభాగాల్లో దరఖాస్తు


పీజీ సీట్లపై చర్చిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డా.రమేశ్, సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, సహాయ ఆచార్యులు డా.కిరణ్‌ప్రకాశ్ తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే : పీజీ సీట్ల కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2016లో కళాశాల ప్రారంభమైంది. ఐదేళ్ల తర్వాత నుంచి పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2021 నుంచి దరఖాస్తు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చినా ఆయా వైద్య విభాగాలకు తగినంత ఆచార్యులు, అసోసియేట్ ఆచార్యులు, సహాయ ఆచార్యులు లేకపోవడంతోనే సీట్లు మంజూరు కావటం లేదు. కొత్తగా దరఖాస్తు చేస్తున్న వైద్య విభాగాలపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రస్తుతం ఉన్నవి 29 మాత్రమే : మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో నాన్ క్లినికల్ విభాగాల్లో 23 పీజీ సీట్లు ఉన్నాయి. క్లినికల్‌లో ప్రసూతి విభాగానికి రెండేళ్ల క్రితం అనుమతి రాగా ఆరు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది పిడియాట్రిక్(చిన్నపిల్లలు), ఆప్తమాలజీ(కన్ను), అనస్థీషియా(మత్తుమందు) తదితర విభాగాల్లో పీజీ సీట్లకు దరఖాస్తు చేయగా ఎన్ఎంసీ పిడియాట్రిక్‌కే అనుమతి ఇచ్చింది. ఈ విభాగంలో మంజూరయ్యే నాలుగు పీజీ సీట్లల్లో వచ్చే నెలలో వైద్య విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. తగినంత మంది ఆచార్యులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో ఆప్తమాలజీ, అనస్థీషియా విభాగాలకు అనుమతి రాలేదు. నెల క్రితం జరిగిన బదిలీల్లో కళాశాలకు అనస్థీషియా, ఆప్తమాలజీ ఆచార్యులు రావటంతో ఆయా విభాగాల్లో పీజీ సీట్ల కోసం మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. వీటికి కూడా అనుమతి లభిస్తే అదనంగా నాలుగు చొప్పున 8 పీజీ సీట్లు మంజూరవుతాయి. 2025 విద్యా సంవత్సరానికి గాను ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్లు), ఈఎన్‌టీ (గొంతు, ముక్కు, చెవి) కోర్సుల్లో నాలుగు చొప్పున సీట్ల కోసం ఈ నెల 17న దరఖాస్తు చేయడానికి కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫీజుగా ఒక్కో విభాగానికి రూ.5.90 లక్షల చొప్పున మొత్తం రూ.11.80 లక్షలు ఎన్ఎంసీకి చెల్లిస్తున్నారు. సిబ్బంది కూడా ఉండటంతో వీటికి పీజీ సీట్లు వస్తాయని నమ్ముతున్నారు.

ముఖ్య విభాగాలకే మొండిచేయి.. : మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో సగానికి పైగా రోగులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వైద్య సేవల కోసమే వస్తున్నారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో పీజీ సీట్లు చాలా అవసరం. జనరల్ మెడిసిన్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు రావడానికి ఒక ఆచార్యుడు, ఏడుగురు అసోసియేట్ ఆచార్యులు, 15 మంది సహాయ ఆచార్యులు, 220 పడకలు, ఏడు యూనిట్లు ఉండాలి. పడకలు, యూనిట్లు ఉన్నా.. ఒక ఆచార్యురాలు, నలుగురు అసోసియేట్ ఆచార్యులు, ఐదుగురు సహాయ ఆచార్యులు మాత్రమే ఉండటంతో పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేయడం లేదు. జనరల్ సర్జరీ విభాగంలో ఆచార్య పోస్టు ఖాళీగా ఉంది. ఒక అసోసియేట్ ఆచార్యుడు, ఆరుగురు సహాయ ఆచార్యులు ఉన్నారు. ఫలితంగా పీజీ సీట్లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. జనరల్ సర్జరీ విభాగంలో వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ట్రాలీ ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు

చికిత్స పొందుతూ కర్నూలు ఆసుపత్రిలో ఇద్దరి మృతి


క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

పెబ్బేరు పట్టణం, గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామ శివారు వద్ద జాతీయ రహదారిపై బుధవారం ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన 15 మంది కుటుంబ సభ్యులు వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి వెళ్లి పెళ్లి సంబంధం కుదుర్చుకుని వస్తుండగా జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి, స్వల్ప గాయాలైన వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో బోయ ముద్దు చిన్నరాముడు(60), బోయ మునెన్న(70) కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో చెనుగోనిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోదనలు మిన్నంటాయి. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం/ రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి


మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర సేవికా సమితి కార్యకర్తల పథసంచలనం



మాట్లాడుతున్న ఉమాదేవి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : శక్తికి ప్రతిరూపం మహిళ అని రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణం బండమీదిపల్లిలోని సాందీపని ఆవాసంలో వారంరోజుల పాటు ప్రారంభిక శిక్షా వర్గను నిర్వహించి చివరిరోజు బుధవారం పట్టణంలో పథసంచలనం నిర్వహించారు. మాడల్ బేసిక్ పాఠశాల నుంచి ర్యాలీగా ప్రారంభమై బాలగంగాధర్‌తిలక్ చౌరస్తా, గడియారం, మార్కెట్ రోడ్, పాతబస్టాండ్, పాన్‌చౌరస్తా, రాంమందిర్‌చౌరస్తా, రాంనగర్, వన్ టౌన్ మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. ముఖ్య వక్తగా ఉమాదేవి మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళా అని అభివర్ణించారు. తమ కుటుంబాన్ని ఏవిధంగా సక్కదిద్దుకుంటుందో ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో కూడా ప్రతి మహిళ పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షురాలు డా.కె.పద్మావతి మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు విద్యార్థినులు ఝాన్సీలక్ష్మీబాయిలా మనోధైర్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వయం సేవికా సమితి విభాగ్ కార్యావాహిక దేదీప్యశ్రీ, పాలమూరు జిల్లా కార్యావాహిక నాగిళ్ల అరుణ, రాష్ట్ర స్వయం సేవికలు లక్ష్మీ, వసంతం పద్మావతి, ఉమా, సులోచన, రాజేశ్వరితో పాటు ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా తీరంలో సఫారీ


సోమశిల అటవీ ప్రాంతంలోని వాచ్‌టవర్ వద్దకు సఫారీ వాహనంలో వచ్చిన పర్యాటకులు

కొల్లాపూర్ అటవీశాఖ ఆధ్వర్యంలో నల్లమల, కృష్ణాతీర ప్రాంతాల్లో విహరించడానికి సఫారీ వాహనం అందుబాటులోకి వచ్చింది. బుధవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వాహనంలో ఒకేసారి 8 మంది ప్రయాణించవచ్చని, ఒకరికి రూ.200 టికెట్‌గా నిర్ధారించినట్లు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమశిల తీరంలోని పుష్కరఘాట్ల దగ్గర, కొల్లాపూర్‌లోని అటవీశాఖ కార్యాలయం, ఏకో పార్కు వద్ద సఫారీ వాహనం అందుబాటులో ఉంచుతామన్నారు. సోమశిల ఏకో పార్కు, అటవీప్రాంతం లోపల వాచ్ టవర్, ఎర్రకుంట తీరప్రాంతం అందాలు చూపించి తర్వాత యథాస్థానంలో దింపుతారు.

- న్యూస్‌టుడే, కొల్లాపూర్

వివాహిత అనుమానాస్పద మృతి


శాంతమ్మ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : బావిలో పడి ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందారని వనపర్తి సీఐ నాగభూషణంరావు తెలిపారు. గోపాల్‌పేట మండల ధర్మతండాకు చెందిన శాంతమ్మ (40) మంగళవారం కూరగాయలు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. ఆమె కుమార్తె వసంత సాయంత్రం 6 గంటలకు తల్లికి ఫోన్ చేసి ఎక్కడున్నావని.. ఎప్పుడు వస్తావని అడిగారు. ఎనుకుంట వద్ద ఉన్నానని త్వరలో ఇంటికి వస్తానని శాంతమ్మ బదులిచ్చారు. ఆమె ఫోన్ 7.30 గంటలకు స్విచ్ఛాఫ్ అయ్యింది. వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శివారులో కావలి వెంకటయ్యకు చెందిన బోరు బావి స్టార్టర్‌ను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్టార్టరు కోసం వెతుకుతుండగా బావి గడ్డపై చెప్పులు, చున్నీ, బావిలో చీర ఉన్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి శాంతమ్మ భర్త బద్రు, కుమారుడు గణేశ్, కుమార్తె వచ్చి చీర, చెప్పులను చూసి గుర్తు పట్టారు. ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నాగభూషణం, ఎస్సై జలేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్ బృందం వెంట వచ్చిన శునకం చెన్నూరు శివారులోని రైస్‌మిల్లు వద్దకు వెళ్లి ఆగింది. వివాహిత మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం వనపర్తి ఆసుపత్రికి తరలించారు. కుమారుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బావిలో నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన బి.ప్రభాకర్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు లభించిందని, త్వరలో నిందితుడిని పట్టుకుంటామని సీఐ తెలిపారు. పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

తెరపై ఈనాడు

దేవర: మనోహర్(నారాయణపేట), వెంకటరమణ(మక్తల్), వనయాంబ(కోస్గి), **శ్వాగ్:** మహేశ్వరి(నారాయణపేట) **- న్యూస్‌టుడే, నారాయణపేట పాతబస్టాండ్**

కూరగాయల ధరలు(కిలోకు)



నారాయణపేట (పాతబస్టాండ్) న్యూస్‌టుడే : టమాట రూ.70, వంకాయలు రూ.60, ముళ్ల వంకాయలు రూ80, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.80, బెండకాయలు రూ.60, బీరకాయలు రూ.80, దొండకాయలు రూ.75, పచ్చిమిర్చి రూ.40, చిక్కుడు రూ.70, పెద్ద చిక్కుడు రూ.75, గోకరకాయ రూ.70, క్యాప్సికం 80, బిన్స్80, క్యాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.80. క్యాబేజి రూ.40, ఉల్లి రూ.50, చింతపండు రూ.110.

గుత్తేదారుడిని హెచ్చరించాం: కాంత్‌కుమార్

ధన్వాడ, న్యూస్‌టుడే: చెరువుల్లో వదలాల్సిన చేపపిల్లలను నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేసిన గుత్తేదారుడిని హెచ్చరించామని జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఎ. కాంత్‌కుమార్ వివరించారు. 'ఈనాడు'లో బుధవారం 'చేప పిల్లల పంపిణీలో చేతివాటం' శీర్షికన వచ్చిన కథనంపై స్పందించారు. సైజు లేని చేపపిల్లలు వచ్చాయని, కిలోకు అయిదు వందలు తూగాయన్నారు. ఈ విషయాన్ని గుర్తించి అప్పుడే గుత్తేదారును ప్రశ్నించామన్నారు. కిలోకు మూడు వందలు తూగే విధంగా ఉంటేనే సరఫరా చేయాలని, లేదంటే వెనక్కి పంపిస్తామని స్పష్టం చేశామన్నారు. మత్స్యకారులకు ఎవరు నష్టం చేసినా ఊరుకునేది లేదన్నారు.

ఫొటోగ్రఫీ, లఘుచిత్రాల పోటీలకు ఆహ్వానం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ, లఘుచిత్రాల పోటీలలో ఔత్సాహికులు పాల్గొనాలని నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతం కోరారు. సంబంధిత అంశాలలో ఇటీవల తీసిన మూడు ఫోటోలు, మూడు నిమిషాల వీడియో ఈ నెల 20లోపు జిల్లా పోలీసు కార్యాలయంలో అందించాలని కోరారు. పూర్తి వివరాలకు 97039 08101, 87126 70380 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళలకు అండగా షీటీం



సైబర్ నేరాలు, చట్టాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : మహిళలకు అండగా షీ టీం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని బృందం సభ్యులు బాలరాజు, చెన్నయ్య తెలిపారు. బుధవారం సత్యసాయి కాలనీలో మహిళలు, విద్యార్థులకు చట్టాలు, సీసీ కెమెరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా లైంగికంగా వేధించిన, మానసికంగా ఇబ్బంది పెట్టినా, సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టినా వెంటనే 8726 70398కు సమాచారం ఇవ్వాలన్నారు.

దాత సాయంతో బోరు మోటారు




సంగంబండలో బోరుమోటారు ప్రారంభిస్తున్న బాలకృష్ణారెడ్డి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : సంగంబండ బుడగజంగం కాలనీలో బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి తన సొంత డబ్బులతో బోరు వేయించి మోటారు ప్రారంభించారు. నీటి ఎద్దడి గురించి కాలనీవాసులు తన దృష్టికి తీసుకురావడంతో ఏర్పాట్లు చేశానన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బలరాం రెడ్డి, సత్యారెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

మహిళా శక్తి క్యాంటిన్ పనులు వేగవంతం చేయాలి

ఊట్కూరు: మండలకేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో రూ. 6 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మహిళా శక్తి క్యాంటిన్ పనులు వేగవంతం చేయాలని తహసీల్దార్ చింత రవి, ఎంపీడీవో ధనుంజయ గౌడ్ సూచించారు. మహిళా శక్తి క్యాంటీన్ పనులను బుధవారం పరిశీలించి మాట్లాడారు.



ఎలిగేండ్లలో సరస్వతిగా..● మక్తల్: వాసవీమాతకు ఒడిబియ్యం ● కోస్గి న్యూటౌన్: వీణాపాణిగా చౌడేశ్వరిమాత ● ధన్వాడ: అంబా భవానీ ఆలయం, బీసీ కాలనీ, పేట శక్తిపీఠంలో అలంకరణలు ● మక్తల్: బతుకమ్మ సంబరంలో ఎమ్మెల్యే సతీమణి లలిత

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



ధన్వాడ రజకసంఘం, పేట ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో...

జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గమ్మ వివిధ అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చింది. ఊరూవాడా అని తేడాలేకుండా ప్రతిచోటా మహిళలు బతుకమ్మలు ఆడారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలతో అన్ని చోట్ల సందడి నెలకొంది. ఆలయాల్లో కుంకుమార్చనలు చేశారు. పలుచోట్ల పల్లకీ సేవలు నిర్వహించారు. –న్యూస్‌టుడే, బృందం



దామరగిద్ద: సరస్వతీ దేవి రూపంలో వాసవిమాత.. అశోక్ నగర్ మలలాంబికాదేవి ఆలయంలో సరస్వతీమాతగా



ధన్వాడలో పూజలు ● దామరగిద్దలో బోనాల ఊరేగింపు.. ● బిజ్వార్ అంజాత్రయ క్షేత్రం.. ● దామరగిద్ద మాత ఆలయాల్లో కుంకుమార్చనలు ● గంగమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు



మరికల్‌లో జడ్పీ మాజీ వైస్ ఛైర్‌పర్సన్ సురేఖారెడ్డి.. ● ధన్వాడలో మాజీ సర్పంచి కెంచె అరుణశ్రీ సారథ్యంలో బతుకమ్మ సంబరాలు.. ●దామరగిద్ద గాంధీనగర్.. ● మరికల్ శివాలయాల్లో పూజలు

దేశ రక్షణలో రాజీ లేదు

ఆర్ఎస్ఎస్ విభాగ్ సంచాలక్ వేమిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు.. ● మాట్లాడుతున్న వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : దేశ, ధర్మ రక్షణలో రాజీపడేది లేదని ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ సంచాలక్ వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మక్తల్ పట్టణంలో జరిగిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పథ సంచాలనం, సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశానికి, ప్రపంచానికి ఆర్ఎస్ఎస్ సేవలు అత్యవసరమని అన్నారు. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని వచ్చే ఏడాదికి సంస్థ వంద ఏళ్లు పూర్తి చేసుకోనుందన్నారు. డాక్టర్ హెగ్డేవర్ త్యాగం వల్లనే హిందువులకు ఒక వేదికగా ఆర్ఎస్ఎస్ పనిచేసిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో సంస్థ వెలకట్టలేని సేవలందించినా కొందరు కావాలని తగ్గించి చూపించారని ఆరోపించారు. లౌకికవాదం పేరిట దేశ సాంస్కృతి, పురాణ ఇతిహాసాలపై దాడులు జరగడం శోచనీయం అన్నారు. పర్యావరణ సంరక్షణ, స్వదేశీ వస్తువుల వాడకం, రాజ్యాంగం, చట్టాలను గౌరవించాలనే సూత్రాలను సంస్థ నిర్దేశించిందన్నారు. అంతకు ముందు మక్తల్ పట్టణంలోని రేడియంట్ పాఠశాల మైదానం నుంచి అంబేడ్కర్ చౌరస్తా, ఆజాద్‌నగర్, గాంధీచౌక్, పాత బజారు, నేతాజీనగర్, మారుతినగర్, రేశంవాడిల మీదుగా సాగిన పథసంచాలనం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ వసంతం వెంకటేశ్, డాక్టర్ అనిల్, ముఖ్య అతిథిగా పరమేశ్వర్, భాజపా రాష్ట్ర నాయకులు కొండయ్య, కర్ని స్వామి, నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కల్లూరి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట: వాకిటి



బొందల్‌కుంటలో రాయితీ గ్యాస్ సిలిండర్ ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం బొందల్‌కుంటలో రాయితీ సిలిండర్ల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందించి మాట్లాడారు.

ఊట్కూరు: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని, క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఓబ్లాపూర్ గ్రామానికి చెందిన తిమ్మప్ప దంపతుల కుమారుడు అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపిక కావటంతో బుధవారం సన్మానించి మాట్లాడారు.

నర్వ, న్యూస్‌టుడే : ఎన్నో ఏళ్లుగా వెనుకబాటుకు గురైన నర్వ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని.. నాయకులు, ప్రజలు సహకారం అందించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం నర్వ రైతు వేదిక భవనంలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం రుణమాఫీ కింద 4824 మంది రైతులకు రూ.42కోట్లు అందించినట్లు చెప్పారు. మండలకేంద్రానికి జూనియర్ కళాశాల, గురుకులంతో పాటు, యువకులకు క్రీడా మైదానం ఏర్పాటుకు రూ.7కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, డి.కృష్ణారెడ్డి, పోలీసు చంద్రశేఖర్‌రెడ్డి, పి.జగన్మోహన్‌రెడ్డి, వివేక్‌వర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో ఫిర్యాదులు



మాగనూరు సామాజిక వేదికలో డీఆర్‌డీవో మొగులప్ప, ఇతర అధికారులు

మాగనూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం మాగనూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. 16 పంచాయతీలలో చేపట్టిన పనులకు రూ.1.94 కోట్ల నిధులకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. రూ.72 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ప్రధానంగా మొక్కల విషయంలో నిధులు అత్యధికంగా దుర్వినియోగమైనట్లు తేల్చారు. నేరేడ్‌గం గ్రామంలో లేని వారి పేర్లపై నిధులు స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. ఆ పంచాయతీలో మరోమారు విచారణ చేయాలని డీఆర్‌డీవో మొగలప్ప ఎంపీడీవో రహ్మతుద్దీన్‌ను ఆదేశించారు . అడవి సత్యవార్ పంచాయతీ పెగడబండ గ్రామంలో పని చేసిన కూలీలకు సక్రమంగా డబ్బులు అందలేదని విచారణ తేలింది. న్యాయ విచారణాధికారి నాగిరెడ్డి, నాణ్యత పరిశీలనాధికారి చంద్రశేఖర్, ఎంపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

కష్టపడ్డారు.. కొలువులు కొట్టారు



వై.వెంకట్‌నర్సిములు.. వై.బస్వరాజ

న్యూస్‌టుడే– మరికల్ కూడలి, కోస్గి న్యూటౌన్

గ్రామీణ నేపథ్యం... మధ్య, దిగువ మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులు డీఎస్సీలో మంచి ఫలితాలతో కొలువులు సాధించారు. కష్టపడి, ఇష్టపూర్వకంగా చదివితే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. ●కోస్గిలోని మున్నూరువాడకు చెందిన అన్నదమ్ములు వై.వెంకట నర్సిములు, వై.బస్వరాజ్‌లు ప్రతిభచాటి ఎస్‌జీటీ విభాగంలో ఉపాధ్యాయులుగా నియామకపత్రాలు బుధవారం హైదరాబాదులో అందుకున్నారు. నర్సిములు 77.63 శాతం మార్కులతో 26వ ర్యాంకును సాధించగా, బస్వరాజ్ 73.90 మార్కులతో పోస్టు కైవశం చేసుకున్నారు.

పెళ్లి తర్వాత చదువుకొని..




మరికల్ మండలం అప్పంపల్లికి చెందిన ఎస్.సునీత ఎస్‌జీటీగా ఉత్తర్వులు అందుకున్నారు. పెళ్లైన తర్వాతే భర్త రవీంద్రరెడ్డి సహకారంతో టీటీసీ పూర్తి చేశారు. ఇద్దరు పిల్లలు ఉన్నా ఉద్యోగ సాధన కోసం కష్టపడటం మానుకోలేదు. ఒక వైపు ఇంటి పనులు, పిల్లల పోషణ చేస్తూనే చదువుకున్నారు. జిల్లాలో 16వ ర్యాంకు సాధించిన ఈమె బుధవారం లాల్‌బహదూర్ మైదానంలో ఉద్యోగ ఉత్తర్వులు తీసుకున్నారు



భర్త ప్రోత్సహంతో..: ధన్వాడ మండలంలోని మందిపల్లికి చెందిన టి. సుకన్య ఎస్‌జీటీగా బుధవారం ఉత్తర్వులు అందుకున్నారు. ఈమె భర్త నర్సిరెడ్డి వ్యవసాయదారుడు. పెళ్లి తర్వాతనే భర్త ప్రోత్సహంతో టీటీసీ చదువుకున్న ఈమె టీచర్ కావాలన్న కలను సాకారం చేసుకున్నారు. సంతానంగా ఒక అబ్బాయి ఉండగా కుటుంబ పోషణ చూసుకుంటూనే ఉద్యోగానికి సిద్ధమై కొలువు సాధించారు.

స్థైర్యం వీడొద్దు.. ప్రశాంతత చెదరొద్దు!



ఉదయం నుంచి రాత్రి వరకు తమ పనులను ప్రశాంత వాతావరణంలో చేసుకుపోయే వ్యక్తులు మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఆలోచనలు, ఆకాంక్షలు, జీవితంపై అంచనాలు ఒకరకంగా, చేసే పనులు, వారి పరిస్థితులు మరో రకంగా ఉంటే మానసిక సంఘర్షణకు, ఒత్తిడికి గురవుతారు. తద్వారా వ్యాకులత చెంది వింతగా ప్రవర్తిస్తారు. ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు కూడా ఒత్తిడికి గురవుతుంటారు. ఫలితంగా వారు ఏం చేస్తున్నారో, ఎవరితో ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంటుంది. ఇంట్లో కుటుంబ సభ్యుల ప్రేమ పొందలేనివారు, చదువులో వెనకబడినవారు, ఉద్యోగం రావటం లేదని బాధపడేవారు, అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఉన్నవారు మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటారు. వీరంతా మానసిక వైద్య నిపుణులను సంప్రదిస్తే నయం చేస్తారు. అవగాహన లేక ఉమ్మడి జిల్లాలో చాలా మంది భూతవైద్యులను ఆశ్రయించి జీవితాలు పాడు చేసుకుంటున్నారు.

రోజూ 150కి పైగా కేసుల రాక : మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు ఉండటంతో మానసిక వైద్యసేవల విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ రకాల మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారు ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రులకు కనీసం రోజుకు 150, నెలకు 4,500 మంది వస్తున్నారు. రుగ్మత తీవ్రంగా ఉంటే వైద్యులు ఔషధాలు ఇస్తున్నారు. తీవ్రత తక్కువగా ఉండి, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

మానసిక రుగ్మతలు చాలా రకాలు.. : ఒకే విషయాన్ని పదే పదేగా ఆలోచించడం, దానిపైనే ధ్యాస కలిగి ఉండటం వల్ల మానసిక రుగ్మతలు వస్తుంటాయి. మానసిక రుగ్మతలు చాలా రకాలుగా ఉన్నాయి. ఒత్తిడి, ఆందోళన, వ్యాకులత, ఆత్మన్యూనత, విచిత్రంగా ప్రవర్తించడం, చేసిన పనిని పదే పదే చేస్తుండటం, అతిగా జాగ్రత్తలు తీసుకోవటం, గతంలో జరిగిన చెడు ఘటనలు తరచూ తలచుకుని బాధపడటం, మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాలు, గంజాయికి బానిసకావటం, తనలో తానే మాట్లాడుకోవటం, ఎవరు పిలిచినా స్పందించకుండా పిచ్చివారిలా ప్రవర్తించడం చేస్తుంటారు. ఆత్మహత్య ప్రయత్నం అనేది మానసిక రుగ్మతనే.

కుటుంబ సభ్యుల సహకారం అవసరం.. : ఉద్యోగ సాధన, ప్రేమ, వ్యాపారం ఇలా ఏదైనా విషయంలో విఫలమైనా, తీవ్ర ఒత్తిడికి లోనయినా, లైంగిక వేధింపులకు గురైనా, ఆర్థిక, అనారోగ్య సమస్యలు వెంటాడినా బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి భరోసా ఇస్తే మందులు అవసరం ఉండదు. కుటుంబ సభ్యుల నుంచే ప్రేమ, ఆదరణ కరవైతే వారు ఏకాకిగా మారుతారు. మెదడులో జరిగే కొన్ని రకాల రసాయనిక చర్యల వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే ఏ సమస్య వచ్చినా చెప్పుకొనేలా, చర్చించేలా ప్రోత్సహించాలి.

ఆల్కహాల్ బానిసలే ఎక్కువ.. : ఉమ్మడి జిల్లాలోని మానసిక రుగ్మతల బాధితుల్లో ఎక్కువ మంది ఆల్కహాల్ బానిసలే. ఆ తర్వాత స్థానంలో ధూమపానం, మాదక ద్రవ్యాలకు బానిసైన వాళ్లు ఉన్నారు. బాధితుల్లో 30 నుంచి 50 ఏళ్ల వారే ఎక్కువగా ఉంటున్నారు. చిన్న చిన్న వాటికి తల్లిదండ్రులు తిడుతున్నారని, కొడుతున్నారని, చదువులో రాణించలేకపోతున్నానని మానసిక ఒత్తిడికి గురవుతున్న టీనేజ్ విద్యార్థులు కూడా ఉంటున్నారు. అన్ని మానసిక సమస్యలకు పరిష్కార మార్గం ఉంది. మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి.

- డా.రమాకాంత్, మానసిక వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

భీతిగొల్పుతున్న మక్తల్-అనుగొండ రహదారి



కర్ని శివారులో గోతులుపడ్డ బీటీ రోడ్డు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : అనుగొండకు వెళ్లే రహదారి కర్ని, ఖానాపూర్ గ్రామాల మధ్య పెద్ద పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారింది. అటువైపు వెళ్లే వాహనదారులు గోతులు తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా మంది వికలాంగులుగా మారారు. మక్తల్ నుంచి అనుగొండకు 26 కిలోమీటర్ల మేరకు ఈ రహదారి ఉంది. వల్లభాపురం, పంచదేవ్‌పహాడ్ గ్రామాల్లో దత్త క్షేత్రం, శ్రీపాదఛాయ ఆశ్రమాలకు ఈ రహదారిపై చాలా గ్రామాల నుంచి భక్తులు వచ్చిపోతుంటారు. 2016లో పుష్కరాల సమయంలో ఈ రహదారిని వెడల్పు చేసి బీటీ వేశారు. కాని ఇంతవరకు ఎలాంటి మరమతులు చేపట్టలేదు. రెండు నెలల కిందట పస్పుల గ్రామానికి చెందిన రైతు తన పంటను డీసీఎంలో రాయచూరుకు తరలిస్తుండగా కర్ని సమీపంలో రహదారిపై వాహనం ఇరుక్కుపోయింది. ఎంత సేపు ప్రయత్నించినా రాకపోవడంతో పొక్లెయినర్ సహాయంతో బయటకు తీశారు. ఇలా తరచూ వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోతున్నాయని వాహనదారులు, గ్రామాల ప్రజలు అంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కేంద్రమంత్రిని కలిసిన భాజపా నాయకులు

ధన్వాడ, న్యూస్‌టుడే : ధన్వాడ, మరికల్ మండలాలకు చెందిన పలువురు భాజపా నాయకులు బుధవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లో కలిశారు. నారాయణపేట జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న బీడీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇళ్లు మంజూరు చేయించాలని ఈ సందర్భంగా కోరినట్లు కలిసిన వారిలో ఒకరైన ఆ పార్టీ జిల్లా మీడియా ప్రతినిధి సుంకు ఉమేష్‌కుమార్ తెలిపారు. ఈయనతో పాటు అంజియాదవ్, అయ్యప్ప ఉన్నారు.

మరికల్‌లో పట్టపగలే దొంగతనం

మరికల్ కూడలి న్యూస్‌టుడే : మరికల్ పట్టణంలో బుధవారం ఓ ఇంట్లో పట్టపగలే దొంగతనం జరిగింది. దొంగలు అయిదు తులాల బంగారం, రూ. 5లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ మురళి కథనం ప్రకారం కుర్వ మోగులప్ప ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలుపడ్డారు. మోగులప్ప కుటుంబ సభ్యులంతా తాళం చెవిని కిరాణ దుకాణం వద్ద ఉన్న కుమారుడికి ఇచ్చి వెళ్లారు. సాయంత్రం కుమారుడు ఇంటికి వెళ్లగా బయటి తాళం ధ్వంసమై కనిపించింది. లోపల సామగ్రి చిందర వందరగా పడి ఉండటమే కాకుండా బీరువా తెరిచి ఉంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటి చిత్రం

ప్రమాదకరం.. స్పందించాలి సత్వరం



దిమ్మెలు వరద ప్రవాహానికి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. వంతెనకు సమీపంలో రోడ్డు కూడా ధ్వంసమైంది. మరికల్ - ఆత్మకూరు ప్రధాన మార్గం కావడంతో భారీ వాహనాలు వెళ్తుంటాయి. రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి రక్షణగోడలు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నారాయణపేట జిల్లా మరికల్ మండలం జిన్నారం ఎక్లాస్‌పూర్ గేటు నడుమ ప్రవహిస్తున్న వాగుపై ఉన్న పురాతన కాజ్‌వే ప్రమాదకరంగా మారింది. నిర్మించిన నుంచి దీనికి మరమ్మతులు చేపట్టలేదు. వంతెనకు ఇరువైపులా ఉండే రక్షణ

రోడ్లపై ధాన్యం.. భద్రతకేది ప్రాధాన్యం!



అన్నదాతలు రోడ్లపై ఆరబెడుతున్న ధాన్యపు రాశులు ప్రమాదకరంగా మారాయి. దాదాపు రోడ్డులో సగభాగాన్ని ఆక్రమించేసి ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ప్రధాన ఆర్అండ్‌బీ రహదారులు కూడా కనుచూపు మేర ఆరబెట్టిన ధాన్యంతో నిండిపోయి ఉంటున్నాయి. వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలకు ముప్పు తప్పదు. మరికల్ మండల కేంద్రం నుంచి ఆత్మకూరుకు వెళ్లే మార్గంలో జిన్నారం స్టేజీ వద్ద సగం రోడ్డును ఆక్రమించి ఆరబెట్టిన మొక్కజొన్న పంటను 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్